- సీఎంకు 'పాలమూరు ప్రగతి' అందజేత

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును ప్రగతిభవన్‌లో మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాను ముద్రించిన 'పాలమూరు ప్రగతి' నివేదిక పుస్తకాన్ని సీఎంకు అందజేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధిపై సమగ్ర సమాచారంతో కూడిన పుస్తకాన్ని చూసి సీఎం హర్షం వ్యక్తం చేశారు. మంత్రిని కేసీఆర్ ఆశీర్వదించారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ కావాలి

- మంత్రి కేటీఆర్‌కు సంఘం నేతల విజ్ఞప్తి

గురువారం ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్‌ను మున్నూరుకాపు అపెక్స్ కమిటీ చైర్మన్, మంత్రి గంగుల కమలాకర్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నేతృత్వంలో కలిసిన ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య. చిత్రంలో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

హైదరాబాద్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మున్నూరుకాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, ఏటా రూ.5,000 కోట్లు కేటాయించాలని మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావుకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో హాస్టల్ భవనాలకు రెండు ఎకరాల చొప్పున భూమి, రూ.5 కోట్ల చొప్పున నిధులు కేటాయించాలని కోరారు. తమ సమస్యలను బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచాలని విన్నవించారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి, మున్నూరుకాపు అపెక్స్ కమిటీ చైర్మన్ గంగుల కమలాకర్, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నేతృత్వంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య తదితరులు గురువారం ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణలో సమారు 50 లక్షల మంది మున్నూరుకాపులు ఉన్నారని, ఆర్థికంగా బాగా వెనుకబడి ఉన్నారని ఈ సందర్భంగా కేటీఆర్‌కు వివరించారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో తమను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పాల్గొన్నారు.

లోకం పోకడ



బీటెక్ బీఈడీ చదివితే డీఎస్సీకి అర్హులే

హైదరాబాద్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): బీటెక్ బీఈడీ పూర్తి చేసిన వారు డీఎస్సీకి అర్హులేనని విద్యాశాఖ స్పష్టంచేసింది. ఈ మేరకు బుధవారం విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. బీటెక్ సంబంధిత సబ్జెక్టుల్లో బీఈడీ ఉత్తీర్ణులైన వారు స్కూల్ అసిస్టెంట్ గణితం, స్కూల్ అసిస్టెంట్ భౌతికశాస్త్రం పోస్టులకు పోటీపడవచ్చని తెలిపింది. రాష్ట్రంలో 5,089 డీఎస్సీ టీచర్ పోస్టుల భర్తీకి గత సెప్టెంబర్ 20 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న విషయం తెలిసిందే.

నేటి నుంచే జేఎన్టీయూ దసరా సెలవులివ్వాలి

హైదరాబాద్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): జేఎన్టీయూహెచ్ కూడా దసరా సెలవు తేదీలను ఈ నెల 13 నుంచి 26 వరకు ప్రకటించాలని తెలంగాణ స్కూల్స్ టెక్నికల్ కాలేజెస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఎస్‌టీసీఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు అయినేని సంతోష్ కుమా ర్ కోరారు. బతుకమ్మ, దసరా ప్రధాన పండుగలని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థలకు 13 నుంచి 26 వరకు సెలవులిచ్చిందని తెలిపారు. ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలు కూడా ప్రభుత్వం ప్రకటించిన సెలవు దినాలనే పాటిస్తున్నాయని గుర్తుచేశారు. కానీ, జేఎన్టీయూహెచ్ మాత్రం 23 నుంచి 28 వరకు బతుకమ్మ, దసరా సెలవులు ప్రకటించడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

ఇకపై రైల్వే రిజర్వేషన్ టికెట్ బదిలీ

హైదరాబాద్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): రైల్వే ప్రయాణికులకు ఇండియన్ రైల్వే శుభవార్త చెప్పింది. టికెట్ రిజర్వేషన్ చేసుకున్న తర్వాత అనివార్య పరిస్థితుల్లో ప్రయాణం రద్దు చేసుకునేవారు తమ రిజర్వేషన్‌ను మరొకరికి షేర్ చేసే అవకాశాన్ని రైల్వేశాఖ కల్పిస్తున్నది. కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఈ రిజర్వేషన్ టికెట్‌ను బదిలీ చేయొచ్చు.

రిజర్వేషన్ బదిలీ ఇలా...

సాధారణ ప్రయాణికులు రైలు బయలుదేరే సమయానికి 24 గంటల ముందు రిజర్వేషన్ ట్రాన్స్‌ఫర్ రిక్వెస్ట్ పెట్టుకోవాలి. అలా చేస్తేనే మరొకరి పేరిట టికెట్ బదిలీ అవుతుంది. ఉద్యోగులైతే పండుగలు, పెండ్లిళ్లు, వ్యక్తిగత కారణాలతో రైలు బయలుదేరే సమయానికి 48 గంటల ముందు రిక్వెస్ట్ పెట్టుకోవాలి. ఎన్‌సీసీ క్యాడెట్లకూ ఇది వర్తిస్తుంది. టికెట్‌ను తన పేరిట బదిలీ చేయించుకునే ప్రయాణీలు వెరిఫికేషన్ కోసం తప్పనిసరిగా ఐడీకార్డు సమర్పించాల్సి ఉంటుంది.

రిజర్వేషన్ బదిలీ ప్రక్రియ ఇదీ

రిజర్వేషన్ టికెట్ బదిలీ ప్రక్రియ దశలవారీగా ఉంటుంది. టికెట్ ప్రింట్ అవుట్ తీసుకొని సమీప రైల్వేస్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌కు వెళ్లాలి. టికెట్‌ను బదిలీ చేయాలనుకుంటున్న వ్యక్తి ఆధార్, పాన్ లేదా ఓటర్ ఐడీకార్డ్ వంటి ఐడీతోపాటు టికెట్ బదిలీ చేయించుకోవాలనుకుంటున్న వ్యక్తి ఐడీ కాపీ తప్పనిసరి ఉండాలి.

భావి ప్రధాని కేసీఆర్

- దేశానికి దిక్సూచిలా తెలంగాణ పాలన
- మా రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను విస్తరిస్తాం
- అరుణాచల్‌ప్రదేశ్ మాజీ ఎమ్మెల్యేల వెల్లడి
- గంగుల, వినోద్‌ను కలిసిన బృందం

కరీంనగర్‌లో గురువారం మంత్రి గంగుల కమలాకర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అరుణాచల్‌ప్రదేశ్ మాజీ ఎమ్మెల్యేలు. చిత్రంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ)/కలెక్టరేట్: 'తెలంగాణ సీఎం కేసీఆర్ భవిష్యత్తులో భారత ప్రధాని కావటం తథ్యం' అని పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్‌ప్రదేశ్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు ముక్తకంఠంతో వెల్లడించారు. తెలంగాణలో పాలన అద్భుతంగా ఉన్నదని, ఈ రాష్ట్రం దేశానికి దిక్సూచిగా ఉన్నదని తెలిపారు. అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యేలు తాయ్ తడాప్, టికీ కామా, బిరిజాయ్, దెబీయా తారా, చావ్ షోటికే హోపాక్, పీకే పులు తదితరులు తెలంగాణ అభివృద్ధిని పరిశీలించేందుకు వచ్చారు. ఇందులో భాగంగా కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం బీసీ సంక్షేమ, పౌర సరఫరాల మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ నివాసంలో వారు మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధి దేశ ప్రజలను ఆకర్షిస్తున్నదని, అందుకే తాము బీఆర్ఎస్‌లో చేరాలనుకుంటున్నట్టు తెలిపారు. దేశాన్ని పాలించే సత్తా కేసీఆర్‌కే ఉన్నదని స్పష్టం చేశారు. 2024 ఏప్రిల్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తామని తెలిపారు. మొత్తం 60 అసెంబ్లీ స్థానాల్లో మెజారిటీ సీట్లు బీఆర్ఎస్‌కు అందించి, కొత్త చరిత్ర సృష్టిస్తామని ధీమా వ్యక్తం చేశారు. దశాబ్దాల తరబడి అనేక సమస్యలతో సతమతమవుతున్న అరుణాచల్‌ప్రదేశ్ ప్రజలను కాంగ్రెస్, బీజేపీ మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. దేశంలో అధికార బీజేపీ ఆగడాలను ఎండగట్టడంలో కాంగ్రెస్ తన పాత్రను పోషించటం లేదని విమర్శించారు. ఈ తరుణంలో కారుచీకటిలో కాంతిరేఖలా బీఆర్ఎస్ కనిపిస్తున్నదని కొనియాడారు. ఈశాన్య రాష్ట్రాల్లో అత్యంత వెనుకబాటుకు గురైన అరుణాచల్‌ప్రదేశ్.. తెలంగాణను ఆదర్శంగా తీసుకుంటే అనతికాలంలోనే అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. దశాబ్దాల పాలనతో దేశాన్ని అధోగతి పాలు చేసిన కాంగ్రెస్, బీజేపీ పాలనకు చరమగీతం పాడుతూ, అభివృద్ధిని సాక్షాత్కరింపజేయటమే బీఆర్ఎస్ ఆలోచన విధానం అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. నిరంతర అభివృద్ధితో తెలంగాణ ఆదర్శంగా మారిందని, దీన్ని గుర్తించి ఇతర రాష్ట్రాల్లోని ప్రజలు బీఆర్ఎస్‌ను ఆహ్వానిస్తున్నారని చెప్పారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఒడిశా, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయని, ఆ రాష్ట్రాల్లో పోటీ చేసే అభ్యర్థులపై దృష్టి సారించనున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా కరీంనగర్‌లో జరిగిన అభివృద్ధిని పరిశీలించిన బృందం.. చాలా బాగా అభివృద్ధి చేశారని మంత్రి గంగుల కమలాకర్‌ను అభినందించింది. కేసీఆర్ రాష్ట్రంలో గొప్ప పాలన అందిస్తున్నారని కొనియాడింది. అనంతరం అరుణాచల్‌ప్రదేశ్ మాజీ ఎమ్మెల్యేల బృందాన్ని గంగుల సన్మానించారు.

20న వంద కేంద్ర బలగాలు రాక

ఎన్నికల సమయానికి మరో 200 కంపెనీలు

పోలింగ్‌కు అదనంగా మరో 5 వేల మంది?

హైదరాబాద్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): ఎన్నికల బందోబస్తుకు 20న వంద కేంద్ర బలగాలు వస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. పోలింగ్ సమయానికి ముందుగా అనుకున్నట్టు 200 కేంద్ర బలగాలు రాష్ట్రంలో అడుగుపెట్టనున్నాయి. 2018 ఎన్నికల బందోబస్తు కోసం కేంద్రం నుంచి మొత్తం 280 కంపెనీలు తెలంగాణకు రాగా, ఆ సంఖ్యను ఇప్పుడు 300కు పెంచారు. తెలంగాణ పోలీసు ఫోర్స్‌తో సహా కేంద్రం నుంచి అదనంగా వచ్చే వివిధ బలగాను రాష్ట్రంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో విధులకు పంపనున్నారు. ఈసారి సరిహద్దు రాష్ట్రాల నుంచి 20 వేల మంది హోంగార్డులను తీసుకుంటున్నట్టు సమాచారం ఉన్నా.. పోలింగ్ నాటికి అదనంగా మరో 5వేల మంది హోంగార్డులు/కానిస్టేబుళ్లను కేంద్ర ఎన్నికల సంఘం తీసుకోనున్నట్టు తెలిసింది. రాష్ట్రంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో అందుబాటులో ఉన్న 64 వేలకు పైగా సిబ్బందికి తోడు కొత్తగా మరో 25 వేల మంది స్పెషల్ ఫోర్స్‌తో ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఎన్నిక సంఘం, రాష్ట్ర పోలీసుశాఖ ప్రణాళిక రచించింది.

'ఎల్‌నినో'తో అధిక వర్షపాతం

హైదరాబాద్ వాతావరణ కేంద్రం

హైదరాబాద్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఈ ఏడాది రాష్ట్రంలో 13% అధిక వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కాలం మారుతున్న సమయంలో ఎండల తీవ్రత ఉంటుందని, దీనికి ఎల్‌నినో ప్రభావం కూడా ఉందని పేర్కొన్నది. ఎల్‌నినో ప్రభావం డిసెంబర్ నాటికి పీక్ స్టేజ్‌లోకి వెళ్తుందని, మే వరకు ఎల్‌నినో ప్రభావం కొనసాగుతుందని వివరించింది. రాష్ట్రవ్యాప్తంగా 2 నుంచి 3 డిగ్రీల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నాయని తెలిపింది. నవంబర్ 2వ వారం నుంచి రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయని చెప్పింది. ఈ సారి చలికాలంపై ఎల్‌నినో ప్రభావం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారి డాక్టర్ శ్రావణి తెలిపారు.

వర్షకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	38.5°c	19.2°c
నల్లగొండ	37.7°c	25.0°c
రంగారెడ్డి	36.7°c	18.5°c
మెదక్	36.6°c	18.0°c
ఖమ్మం	35.0°c	24.0°c
కరీంనగర్	34.0°c	23.0°c
వరంగల్	34.0°c	23.0°c
నిజామాబాద్	33.6 °c	22.1°c
హైదరాబాద్	33.2°c	21.2°c
మహబూబ్‌నగర్	33.0°c	24.2°c

కదనరంగంలో కృష్ణార్జునులు

- అధినేత ఆలోచనలు జట్టుగా జనాల్లోకి
- బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపుతున్న మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు
- 64 నియోజకవర్గాల్లో ప్రచారం పూర్తి
- జనంతో మమేకం.. కార్యకర్తల్లో జోష్
- తొలిదశ ప్రచార పర్వం విజయవంతం

హైదరాబాద్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): సమన్వయం.. సమరతత్వం రెండూ కలగలిసిన నేతలు వారు. గులాబీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపడం.. జనంతో మమేకం కావడం ఆ ఇద్దరికి ఉద్యమం నుంచి అబ్బిన విద్య. రాష్ట్రంలో మరేపార్టీకి లేని ఆయుధాలు వాళ్లు. యూత్ ఐకాన్, స్టైలిష్ పొలిటీషియన్ అని ఒకరిని, ఆరు అడుగుల బుల్లెట్, ట్రబుల్ షూటర్ అని మరొకరిని పార్టీ శ్రేణులు ఇష్టంగా పిలుచుకొంటారు. రాష్ట్ర ప్రజలు వీరిని కృష్ణార్జునులుగా సంభోదిస్తారు. వారే ఒకరు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, మరొకరు వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు. అది ఉద్యమమైనా.. ఎన్నికలైనా ఇద్దరూ బరిలో దిగితే విపక్షాలకు ముచ్చెమటలేనని అనేక సందర్భాలు నిరూపించాయి. ఈసారికూడా కదనరంగంలోకి దూకి రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాలను చుట్టివచ్చారు. అధినేత ఆలోచనలను కలిసికట్టుగా జనాల్లోకి తీసుకెళ్లారు. రాష్ట్రంలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేనాటికే రాష్ట్రమంతా ప్రచార సభలను నిర్వహించాలనే లక్ష్యానికి ఇప్పటికే చేరువలో ఉన్నారు. ఆగస్టు 21న బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ పార్టీ అభ్యర్థులను ప్రకటించినప్పటినుంచి మంత్రులిద్దరూ రాష్ట్రంలోని 64 అసెంబ్లీ నియోజకవర్గాలను చుట్టివచ్చారు. మంత్రుల సుడిగాలి పర్యటనలతో రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో చూసినా హ్యాట్రిక్ కొట్టాలన్న వజ్రసంకల్పం బీఆర్ఎస్ శ్రేణుల్లో తొణకిసలాడుతున్నది. బీఆర్ఎస్ శ్రేణుల సమరోత్సాహ ప్రదర్శనను చూసి కాంగ్రెస్, బీజేపీలు బెంబేలెత్తిపోతున్నాయి.

అధినేత ఆలోచన.. మంత్రుల ఆచరణ

బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ఆలోచనను అక్షరాలా కార్యాచరణలో పెడుతూ ప్రజలను సమీకరిస్తూ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు కృష్ణార్జునుల్లా సమరశంఖం పూరించారు. ఎన్నికల షెడ్యూల్ కన్నా ముందే 50 నియోజకవర్గాలను చుట్టివచ్చారు. షెడ్యూల్ విడుదల తరువాత 14 నియోజకవర్గాలు ఇలా మొత్తం ఇప్పటి వరకు 64 నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారాన్ని పూర్తిచేశారు. చెన్నూరు వంటి నియోజకవర్గంలో వేర్వేరు సందర్భాల్లో ఇద్దరు మంత్రులు పర్యటించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రారంభోత్సవాలు, భూమిపూజల్లో పాల్గొన్నారు. మెడికల్ కాలేజీల నిర్మాణాలకు భూమిపూజలతో మంత్రి హరీశ్‌రావు, హైదరాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల్లో ఐటీ పార్కుల ప్రారంభోత్సవాలు, భూమిపూజలతో మంత్రి కేటీఆర్ ఎడతెరపిలేని కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు, పార్టీ శ్రేణులను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొంటూ పకడ్బందీ కార్యాచరణను అమలు చేస్తున్నారు. మంత్రి కేటీఆర్ ఈ నెల 2వ తేదీన చెన్నూరు, రామగుండం, పెద్దపల్లి నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటన చేస్తే మంత్రి హరీశ్‌రావు ఈ నెల 6వ తేదీన మహేశ్వరం, జుక్కల్, నిజామాబాద్ రూరల్, కోరుట్ల, మానకొండూరు ఈ ఐదు నియోజకవర్గాలను చుట్టివచ్చారు.

బీఆర్ఎస్‌లో నయాజోష్

ఆత్మీయ సమ్మేళనాలు, 21 రోజుల దశాబ్ది ఉత్సవాలు, పోడుభూములకు అటవీ భూయాజమాన్య హక్కు పత్రాల పంపిణీ, మెడికల్ కాలేజీల ప్రారంభోత్సవాలు బీఆర్ఎస్ పార్టీలో నయాజోష్‌ను నింపాయి. దేశానికే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్, మంత్రులపై కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన నేతలు చేస్తున్న విషప్రచారాన్ని నియోజకవర్గాల్లో అన్ని స్థాయిల పార్టీ శ్రేణులు ఎక్కడిక్కడ తిప్పికొడుతున్నాయి. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో జరిగిన ప్రగతి, 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి పట్టిన దుర్గతిని కండ్లకు కడుతూ ముందుకు దూసుకుపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్లకాలంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ.. సంక్షేమ ఫలాలు అనుభవించిన కుటుంబాలను నేరుగా కలుస్తూ బీఆర్ఎస్ పార్టీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో మూడోసారి అధికారాన్ని చేపట్టాల్సిన అనివార్యతలను ప్రజలకు వివరిస్తున్నారు. అధికారమే పరమావధిగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్, బీజేపీ కుట్రలను ప్రజలకు అర్థమయ్యేలా వివరిస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీజేపీలు బీఆర్ఎస్ ప్రభుత్వంపై చేస్తున్న ప్రచారంలో నిజానిజాలు తమకు తెలుసని, 'సద్దితిన్న రేవును మరువం' అని ప్రజలు బీఆర్ఎస్‌కు బాసటగా నిలుస్తున్నారు.

యంగ్ తరంగ్

మొదటిపేజీ తరువాయి...

పార్టీ చట్టసభల్లో అడుగుపెట్టే అవకాశం కల్పించింది. పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, కడియం శ్రీహరి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, డీఎస్ రెడ్యానాయక్ వంటి అనుభవ శీలురను ఎన్నికల బరిలో దింపుతూ ప్రజామోదాన్ని సొంతం చేసుకొన్నది. వచ్చేనెల జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే 115 మంది అభ్యర్థులను అధికారికంగా ప్రకటించింది. మరో 4 నాలుగుస్థానాల్లో పోటీచేసే అభ్యర్థులకు మౌఖిక సంకేతాలిచ్చింది. బీఆర్ఎస్‌లో బరిలో నిలుపుతున్న 119 మంది అభ్యర్థుల్లో 68 మంది 55 ఏండ్లలోపువారే ఉన్నారు. ఇందులో ములుగులో బడే నాగజ్యోతి, సికింద్రాబాద్ కంటోన్మెంట్ నుంచి లాస్య నందిత, కోరుట్ల నుంచి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, ఖానాపూర్ నుంచి భూక్యా జాన్సన్ రాథోడ్, కార్వాన్ నుంచి ఐ కృష్ణయ్య, మలక్‌పేట నుంచి తీగల అజిత్‌రెడ్డి వంటి ఏడుగురు కొత్తవారికి సీఎం కేసీఆర్ అవకాశం కల్పించారు. బీఆర్ఎస్‌తోనే రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన కేటీఆర్, హరీశ్‌రావు, దాస్యం వినయభాస్కర్, బాల్క సుమన్, అరూరి రమేశ్, నన్నపునేని నరేందర్, గాదరి కిశోర్, నోముల భగత్, శానంపూడి సైదిరెడ్డి.. ఇలా ఎంతోమంది యువకులను ప్రోత్సహిస్తూ రాజకీయాల్లో భవిష్యత్తు తరానికి యువ నాయకత్వాన్ని అందించే పనిని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పకడ్బందీగా అమలు చేస్తున్నారు.

అనుభవసారం.. పాలన పరిపక్వం

యువతను, అనుభవజ్ఞులను వారధిగా చేసి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో రెండుసార్లు ప్రజారంజక పాలన అందించి తెలంగాణను దేశానికి దిక్సూచిగా నిలిపిన ముఖ్యమంత్రి కేసీఆర్, ఇప్పుడు అభ్యర్థుల ఎంపికలో అదే ఒరవడిని కొనసాగించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న రెడ్యానాయక్, ఎర్రబెల్లి దయాకర్‌రావు ఏడోసారి గెలుపు దిశగా అడుగులేస్తున్నారు. లంబాడా సామాజిక వర్గానికి చెందిన రెడ్యానాయక్ జనరల్ స్థానమైన డోర్నకల్ నియోజకవర్గంలో 1989 నుంచి 2004 వరకు గెలుస్తూ వచ్చారు. జనరల్ స్థానంలో గెలిచిన ఎస్టీ అభ్యర్థిగా రెడ్యానాయక్ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. ఎస్టీ నియోజకవర్గంగా మారిన తర్వాత డోర్నకల్‌లో 2009లో ఆయన ఓటమిపాలైనా 2014, 2018లో గెలుపొందారు. తాజాగా మరోసారి శాసనసభ ఎన్నికల్లో ప్రజా తీర్పు కోసం బరిలో నిలిచారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కూడా 1994 నుంచి వరుసగా ఓటమి ఎరగని నేతగా గుర్తింపు పొందారు.

'కేసీఆరే తెలంగాణకు శ్రీరామరక్ష- ఓట్ ఫర్ కేసీఆర్.. ఓట్ ఫర్ డెవలప్‌మెంట్' అని రాసి ఉన్న బీఆర్ఎస్ పార్టీ నేత అలిశెట్టి అరవింద్‌కు చెందిన వాహనాలు

మూడు స్థానాల నుంచి..

రాష్ట్ర అసెంబ్లీలో ముఖ్యమంత్రి కేసీఆర్ తరువాత.. బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఒక ప్రత్యేకత ఉన్నది. అసెంబ్లీ చరిత్రలో ఒకే వ్యక్తి మూడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి గోవర్ధన్ గెలిచారు. ఆర్మూర్, బాన్సువాడ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల నుంచి గెలిచిన బాజిరెడ్డి ప్రస్తుతం ఐదోసారి ఎన్నికల బరిలో గెలుపు కోసం కసరత్తు చేస్తున్నారు.

ఆరో టర్మ్ గెలుపు దిశగా...

"బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల్లో ఇద్దరు ఆరో టర్మ్ గెలుపు కోసం బరిలో నిలిచారు. అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆరోసారి టిక్కెట్లు దక్కించుకున్నారు. ఈ ఎన్నికల్లో గెలవడం ద్వారా ఈ ముగ్గురు ఆరో టర్మ్ గెలిచినవారి జాబితాలో చేరనున్నారు. అలాగే స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి 1994, 1999, 2009, 2014, 2018లో ఐదు టర్మ్‌లు గెలిచారు. 2011 ఉప ఎన్నికల్లోనూ గెలిచిన చరిత్ర ఆయనది.

రెండు స్థానాల నుంచి..

ఈ సారి పోటీచేస్తున్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ అభ్యర్థుల్లో రెండు నియోజకవర్గాల నుంచి గెలిచిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు (సిద్దిపేట, గజ్వేల్), ఎర్రబెల్లి దయాకర్‌రావు (వర్ధన్నపేట, పాలకుర్తి), కొప్పుల ఈశ్వర్ (మేడారం, ధర్మపురి), సబితా ఇంద్రారెడ్డి (చేవెళ్ల, మహేశ్వరం), తలసాని శ్రీనివాస్‌యాదవ్ (సికింద్రాబాద్, సతన్‌నగర్) ఉండటం విశేషం.

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ నేవీలో..

ఇండియన్ నేవీలో షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ఆఫీసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 224
- పోస్టులు: జనరల్ సర్వీస్/హైడ్రో కేడర్, నేవల్ ఎయిర్ ఆపరేషన్స్, పైలట్, లాజిస్టిక్స్, నేవల్ ఇన్‌స్పెక్టర్ తదితరాలు
- విభాగాలు: ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్, ఎడ్యుకేషన్ బ్రాంచ్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: అక్టోబర్ 29
- వెబ్‌సైట్: https://www.joinindiannavy.gov.in

నాన్ టీచింగ్ పోస్టులు

సూరత్‌లోని సర్దార్ వల్లభాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 12
- పోస్టులు: జూనియర్ అసిస్టెంట్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 6
- వెబ్‌సైట్: http://www.svnit.ac.in

షార్‌లో...

శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 10
- పోస్టులు: సైంటిస్ట్/ఇంజినీర్
- విభాగాలు: పాలిమర్ సైన్స్, ఎమ్మెస్సీ అగ్రికల్చర్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 3
- వెబ్‌సైట్: https://www.shar.gov.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- జనరల్ సైన్స్, ఎకానమీ, జాగ్రఫీ మెటీరియల్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.